

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

13 మే,2025 మంగళవారం పేజీలు:6

www.epaper.navabhoomi.in


# పంచాయతీ ఎన్నికలపై అయోమయం




**సిరిసిల్ల -నవభూమి:** స్థానిక పోరు ఇప్పట్లో రానంటున్నాయ్.. ఒకవైపు ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సర్వం సన్నద్ధమైన సామాజికవర్గాల రిజర్వేషన్లు బ్రేక్ వేస్తున్నాయి. ప్రధానంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పంచాయతీ తేలే వరకు స్థానిక ఎన్నికలు జరిగే సంకేతాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్నికలను ఊరిస్తూ వాయిదాలు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టే అవకాశాలు ఉండడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే అని అభిప్రాయంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచేందుకు సవరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సవరణ కావాలంటే పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ ప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఎన్నికలంటూ ఆశలు కల్పిస్తున్నారు. దీంతో ఎలక్షన్ల కోసం ఎదురుచూస్తున్న ఆశావాహులు అయోమయంలో పడ్డారు. 2024జనవరి నెలలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసినా ఎన్నికలపై ఇప్పటికీ గందరగోళ పరిస్థితి వీడటం లేదు. ప్రస్తుత రిజర్వేషన్ల పరిస్థితుల్లో మరో ఆరు నెలల పాటు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపల్, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే అంటూ అధికారులు ఆశావహులు ఉన్నారు. అధికార యంత్రాంగం ఓటర్ జాబితాతో పాటు ఇతర ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ గుర్తులతో పాటు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచారు. కానీ ఆశావహులకు ఎదురుచూపులు మాత్రం తప్పడం లేదు.నోటిఫికేషన్ రావడమే తరువాయి..రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం చెప్పినట్లు జూలైలో ఎన్నికల వచ్చిన అధికార యంత్రాంగం మాత్రం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నారు. 2019 గ్రామపంచాయతీ ఎన్నికలు రాజన్నసిరిసిల్ల జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించింది. ఈసారి కూడా మొదట్లో మూడు విడతలుగా ఏర్పాటు చేసినా రెండు విడతల్లోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించడం దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో మొదటి విడతలో 137 సర్పంచ్‌లు, 1,888 వార్డులు, రెండో దశలో 123 గ్రామాలు, 1,080 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేశారు. ఓటరు జాబితా రెడీ...జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు కీలకంగా ఉండే ఓటరు జాబితాను సిద్ధం చేశారు. 260 గ్రామపంచాయతీల్లో మూడు లక్షల 46 వేల 259 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో పురుషులు 1,67,686 మంది, మహిళలు 1,78,553 మంది, 20 మంది ట్రాన్స్‌జెండర్ ఓట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రీసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రీసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 వరకు ఉండే పోలింగ్ కేంద్రంలో ప్రీసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నారు. జిల్లాలో 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రాలు, 134 ఉండగా, 400 ఓటర్లు ఉన్న కేంద్రాలు 468 ఉండగా, 650 ఓటర్లు ఉన్నవి 76 కేంద్రాలు ఉన్నాయి.గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20 గుర్తులు కేటాయించారు. సర్పంచ్‌లకు సంబంధించి పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్‌ల ఎన్నికల గుర్తుల్లో ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, లేడీ పర్స్, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, పాన్, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, నల్ల బోర్డు, బకెట్, డోర్ హ్యాండిల్, చేతికర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలిబుడగ, తదితర గుర్తులు ఉన్నాయి. వార్డు సభ్యులకు సంబంధించి పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలెండర్, గౌన్, ఈల, కుండ, గరాట, ముకుడు, డిష్ ఏంటీనా, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, కవర్, కటింగ్ ప్లేయర్, హాకీ, కర్రబంతి, నైక్ టై, విద్యుత్ స్థంబం, షటిల్, గుర్తులు కేటాయించారు. గుర్తుల్లో కొన్ని గుర్తుంచుకోవడం కష్టమే అన్నట్లుగా భావిస్తున్నారు.

# జిల్లాను హెల్త్ కేర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం



# ప్రజలవద్దకు పోలీసులు



**కరీంనగర్ -నవభూమి:** ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలని, ఎక్కడ సమస్యలుంటే అక్కడికి వెళ్లి పరిష్కరించాలని డీజీపీ జితేందర్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సీపీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పోలీసు అధికారులు కార్యాలయాలలోనే ఉండకుండా క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని ఎక్కడికక్కడ పరిష్కారిస్తున్నారు.కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రార్థనా మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ప్రాంతాల వంటి రద్దీ ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలు పెంచుతున్నారు. దీనిలో భాగంగా పట్టణాల్లోని కాలనీల్లో, గ్రామాల్లో సైబర్ నేరాలపై, డ్రగ్స్, మూఢనమ్మకాలు, తదితర నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలస్థాయిలోనూ రోజుకో గ్రామం, పల్లెకు వెళుతున్న పోలీసులు స్థానికులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. స్థానికులతో సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ మోసాలు జరిగే తీరు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.ముమ్మరంగా తనిఖీలు నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద స్టాటిక్ పికెట్స్‌తోపాటు పలుచోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణాల్లోని కాలనీల్లో, గ్రామాలతో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే వారిని విచారిస్తూ వేలిముద్రలు సేకరించి డాటాబేస్‌లో అప్‌లోడ్ చేస్తూ గతంలో ఏవైనా నేరఘటనల్లో ప్రమేయం ఉందా అనేది నిర్ధారించకుంటున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో పోలీసులతోపాటు డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందాలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీలతో పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే బస్టాండ్లు, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో నిరంతర పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. సంఘ విద్రోహశక్తులు, మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు.పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా హెచ్చరికలు, సూచనలు బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా అనుమానిత వ్యక్తులు లేదా వస్తువుల గురించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు, సూచనలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. సోషల్ మీడియాపై నిరంతర నిఘాపెట్టారు. గ్రామాల్లోనూ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలో నక్సల్స్ సమస్య ఉన్న సమయంలో పోలీసులు గ్రామాలకు వెళ్లడానికి గ్రూపుగా చాలా జాగ్రత్తలు తీసుకునేవారు. నక్సల్స్ ప్రాబల్యం తగ్గడంతో పోలీసులు మారుమూల గ్రామాలకు కూడా ఒంటరిగా వెళుతున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామానికి వెళుతై బ్లూకోల్ట్స్ పోలీసులు రౌండ్ ద క్లాక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

## వైభవంగా నరసింహ

# జయంత్యుత్సవాలు



## ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ. 40 కోట్లు స్వాహా



**కరీంనగం-నవభూమి:** ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట 100 మంది వద్ద 40 కోట్ల రూపాయల వరకు డబ్బులు తీసుకుని ఏడాదిగా జాడలేకుండా పోయాడని బాధితులు ఆదివారం సప్తగిరి కాలనీలోని నిందితుడి ఇంటి వద్ద ధర్నా చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... సప్తగిరి కాలనీకి చెందిన మొలుగూరి సురేష్ స్థానికులను నమ్మించి ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌లో డబ్బులు పెడితే త్వరగా రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మరికొందరికి చెప్పాడు. ఇలా 100 మంది వద్ద 40 కోట్ల రూపాయలు తీసుకున్నాడు. కొంతకాలంపాటు డబ్బులకు వడ్డీ చెల్లించడం, ఉద్యోగం ఇచ్చిన వారికి వేతనాలు ఇచ్చాడు. అనంతరం ఎవరికీ చెప్పకుండా మాయమయ్యాడు. ఏడాది కాలంగా సురేష్ బాధితులకు వడ్డీ ఇవ్వడంలేదు. వేతనాలు చెల్లించడం లేదు. దీనిపై కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఇప్పటి వరకు సురేష్ జాడ తెలియలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

**కరీంనగర్ -నవభూమి:** మండలంలో ధాన్యం కొనుగోళుచివరి దశకు చేరాయి. ఇప్పటికే రెండు, మూడు కేంద్రాల్లో పూర్తిగా కొనుగోళ్లు పూర్తి కాగా మూసివేసేందుకు సిద్ధమయ్యారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో చివరి దశకు చేరగా నగునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పేరుకుపోయింది. దీంతో కాంటాలు కాని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ యాసంగిలో మండలంలో 13,210 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 2,100 ఎకరాల్లో సన్నాలు, 11,110 ఎకరాల్లో దొడ్డురకం వరి పంటను సాగు చేశారు. మొత్తం 20 వేల మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అంచనా వేశారు. మండలంలో 20 కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను గత నెల 18న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. గత సీజన్‌లో 1.49 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించగా ప్రస్తుతం ఇప్పటి వరకు 1,45,534 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో కరీంనగర్ వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఎనిమిది గ్రామాల్లో 1,605 మంది రైతుల నుంచి 81,362 క్వింటాళ్లు కొన్నారు. దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాల్లో 40,710 క్వింటాళ్లు, ఐకేపి ఆధ్వర్యంలో ఆరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 23,462 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. నగునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పేరుకుపోయింది. ఇప్పటికే మొగ్దుంపూర్‌లో కొనుగోలు కేంద్రం మూసి వేశారు.

## సింగరేణి స్టేడియంలో క్రికెట్ పోటీలు

**గోదావరిఖని, -నవభూమి:** సింగరేణి ఆర్‌జీ-1 ఏరియాలోని జీడీకే 2ఇంక్లైన్, 11ఇంక్లైన్ ఉద్యో గులు ఆదివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఇన్‌చార్జి సిర్ర మల్లికార్జున్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లయ్య ప్రారంభించారు. ఇరు జట్ల క్రికెట్ టీం సభ్యులకు 11ఇంక్లైన్ ఏఐటీయూసీ ఇన్‌చార్జి సిద్దమల్ల రాజు, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, సహాయ కార్యదర్శి గొడిశల నరేశ్‌ల సహకారంతో టీ షర్ట్స్ పంపిణీ చేశారు.సింగరేణి యువ కార్మికులు సెలవు రోజుల్లో విశ్రాంతి తీసుకోకుండా క్రికెట్ పోటీల్లో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుం దని, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటారని ఎల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, సింగరేణి ఆర్‌జీ-1 స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి, నాయకులు పొన్నాల వెంకటయ్య, చెప్యాల భాస్కర్, తాళ్ళపెల్లి శ్రీనివాస్, జాన్ కెనడీ, ఏవీఎస్ ప్రకాశ్ పాల్గొన్నారు.

# జిల్లాను హెల్త్ కేర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**జగిత్యాల, -నవభూమి:** జిల్లాను హెల్త్ కేర్ హబ్‌గా తీర్చి దిద్దటానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో మెడికల్ అండ్ హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి పరిధిలో ఉన్న ఆసుపత్రుల బలోపేతంపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాల, మాతా శిశు కేంద్రానికి అవసరమైన వైద్య పరికరాలు అందజేస్తామన్నారు. జగిత్యాల జనరల్ హాస్పిటల్‌కు ఎంఆర్ఐ, స్కానింగ్ కేంద్రాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో గల మూడు డయాలసిస్ సెంటర్ల రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు. జిల్లాను వైద్య పరంగా మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నూటికి నూరు శాతం డెలివరీలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇందుకు ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు కృషి చేయాలన్నారు. సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం జగిత్యాల, ధర్మపురి, వేములవాడ పరిధిలో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు. చేశామన్నారు. జిల్లాకేంద్రంలో సెంట్రల్ డ్రగ్ సెంటర్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునికమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.జిల్లాకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలిప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలో వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిల అభివృద్ధికి సంబంధించిన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. రోడ్డు ప్రమాద



బాధితుల కొరకు ట్రామాకేర్ సెంటర్లను మంజూరు చేయాలన్నారు. జిల్లాను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం దృష్టి సారించడం సంతోషదాయకమన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించిన రూ.6 కోట్లు, వైద్య విధాన పరిషత్‌కు రూ. 6.25 కోట్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రూ.74 లక్షలు, మెడికల్ కళాశాల భవనానికి సుమారు రూ.40 కోట్లు మంజూరు చేయాలని కోరారు.వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఎంసీహెచ్ ఏర్పాటు చేయాలి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ ఏరియా ఆసుపత్రిలో 50 పడకల మాతా శిశు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడకు ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, భీమారం మండలాలకు 108 వాహనాలు మంజూరు చేయాలని కోరారు. వేములవాడలో వంద పడకల ఆసుపత్రికి సరిపడా వైద్యులు, ఉద్యోగుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. సూరమ్మ చెరువురు రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ భూసేకరణ కోసం నిధులు మంజూరు చేయాలన్నారు.వైద్య విధాన పరిషత్ భవన నిర్మాణం పూర్తి చేయాలి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లిలో వైద్య విధాన పరిషత్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. కోరుట్ల నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో పలుమార్లు విన్నవించానని గుర్తు చేశారు. మెట్‌పల్లి పట్టణంలో మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ మిషిన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి భవనం పూర్తయి నెలలు గడుస్తున్నా అందులో వైద్యుల కొరత ఉన్నందున వైద్యులను నియమించాలని కోరారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల నాలుగు మండలాలకు అంబులెన్స్‌లు కావాలని తెలిపారు. కోరుట్ల పట్టణంలో గల వంద పడకల ఆసుపత్రిలో అవసరమయ్యే పరికరాలను త్వరితగతన అందజేయాలని విన్నవించారు. కోరుట్ల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ భవనాలను త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ జిల్లాకు అవసరమైన డ్రగ్స్ పెండింగ్ బిల్లు మంజూరు ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కోరారు. జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో ఆక్సీజన్ ప్లాంట్ రిపేర్ చేయాలన్నారు. జగిత్యాల నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు వైద్య ఆరోగ్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసి అవసరమైన సిబ్బంది నియమించాలని కోరారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు మూడు బస్‌లు మంజూరు చేయాలని, జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సూపరిండెంట్‌లను నియమించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాద్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ పాల్గొన్నారు.

# వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు

**ధర్మపురి,-నవభూమి:** ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసకపూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాలకు, శ్రీ స్వామి వారలకు, దేవాలయాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో రెండు లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి ఆరంభమైన నరసింహ నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.ఫనరసింహ హెూమంలో పాల్గొన్న మంత్రి దామోదర ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హెూమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పాల్గొన్నారు. లోక క్షేమార్థం, కుటుంబ సౌభాగ్యం కోసం నిర్వహించిన నిత్య నరసింహ హెూమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహచే ఆలయ అర్చకులు నంబి అరుణ్‌కుమార్, చక్రపాణి కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి యాగశాల వద్ద భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద మంత్రికి ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాద వితరణ జరిపి, ప్రసాదాలు బహుకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులు సమ్మెను వ్యతిరేకించాలి




గోదావరిఖని, -నవభూమి: రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలైన కార్మిక సంఘాలు రాజకీయ ఎజెండాను అమలు చేయడానికి, కార్మిక సంఘాల ఉనికి చాటుకోవడానికి ఈనెల 20న చేస్తున్న రాజకీయ సమ్మెను సింగరేణి కార్మికులు వ్యతిరేకించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాద గిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి కార్మికవ ర్గానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావే శంలో వారు మాట్లాడుతూ దేశంలో విప త్కర పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ప్రజ లకు, ప్రభుత్వాలకు రాజకీయాలకు అతీ తంగా మద్దతు పలుకాల్సిన రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్ల డం సరైన విధానం కాదని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, రక్షణ, మౌలిక సదుపాయాలు, ఆర్థిక ప్రయోజనం లేని రాజకీయ ప్రేరేపిత సమ్మెను వ్యతిరేకించాలన్నారు. దేశంలో ఉన్న పరిశ్రమల కార్మికులు, ఉద్యోగులు ప్రజలు అప్రమత్తంగా ఉండి దేశానికి అండగా ఉండాలని, సంక్షోభ సమయంలో సమ్మెకు పిలుపునివ్వడం దేశ సమగ్రతను విఘాతం కల్పించే విధంగా ఉంటుందని గమనించాలన్నారు. యూనియన్ నాయకుడు కర్రావుల మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీష్, మేడ రామ్మూర్తి, పెంచాల వెంకటస్వామి, తుమ్మ గట్టయ్య, పుప్పాల నాగేంద్ర ప్రసాద్, సల్ల వేణు పాల్గొన్నారు.

## రైతులు అధైర్యపడొద్దు

పెద్దపల్లి -నవభూమి: అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిన రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షం వల్ల ధాన్యం తడిస్తే ధాన్యంపై ఉప్పు నీళ్ళ చల్లితే రంగు మారకుండా, గింజ నలుపు రంగులోకి మారకుండా ఉంటుందని సూచించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్, గౌరెడ్డిపేట కేంద్రాల్లో కొంతమేర ధాన్యం తడిసిందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయిస్తానని, తూకం వేసిన తరువాత బస్తాలను వేరుగా ఉంచితే రైస్‌మిల్లర్లకు పంపించేందుకు చర్యలు తీసుకుంటానని, నిర్వాహకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ మార్కెట్లో సుమారుగా 16 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం వచ్చిందని, ఇందులో 11 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని వేగంగా కొనుగోలు పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎలాంటి కటింగ్ లేకుండా మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తా మన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి నిర్ణీత గడువులోగా చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, డైరెక్టర్లు, మాజీ చైర్మన్ జడల సురేందర్, మార్కెట్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు భూషణవేన సురేష్ గౌడ్, నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, అమ్రేశ్, పొగాల శ్రీకాం త్, మసూద్, నదీం, బూతగడ్డ అజయ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# 'ఎర్లీబర్డ్' అంతంతే



సిరిసిల్ల -నవభూమి: ఆస్తి పన్ను వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామపంచాయతీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు సైతం ముందు వరుసలోనే నిలిచాయి. గ్రామపంచాయతీలతో పోల్చుకుంటే మున్సిపాలిటీల్లో 2024-2025 ఆస్తి పన్నుల వసూళ్లలో రూ.9.60 కోట్ల వరకు వసూలు చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీల్లో 96.99శాతం, వేములవాడలో 85.14శాతం పన్నులు వసూలు చేశారు. మున్సిపాలిటీల్లో ప్రతి సంవత్సరం ఎర్లీ బర్డ్ పేరిట ఐదు శాతం రిబేట్‌తో రాయితీ స్కీంలో ఆస్తి పన్ను చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం ఇస్తూ వస్తోంది. ఇందులో భాగంగా మార్చి 31 వరకు సాధారణ పన్నుల వసూలు ప్రక్రియ పూర్తికాగా, ఏప్రిల్ 30వరకు ఐదు శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 30వరకు కూడా ఆశించిన మేరకు పన్నుల వసూలు లేకపోవడంతో మే 7 వరకు అవకాశాన్ని పొడిగించినా రాయితీపై అంతంత మాత్రంగానే స్పందన వచ్చింది.ఎర్లీ బర్డ్‌లో రూ.3.77 కోట్ల వసూలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు 2025-26 ఆస్తి పన్నులకు సంబంధించి సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,778 భవనాలకు సంబంధించి రూ 9.75 కోట్లు లక్ష్యంగా ఉంది. ఇందులో 5 శాతం రాయితీని 5,117 ఇండ్లకు సంబంధించి వినియోగించుకున్నారు. 2.37 కోట్లు వసూలు కాగా 24.31 శాతంగా ఉంది. వేములవాడలో 15,002 భవనాలకు సంబంధించి 20.11 కోట్లు కాగా, 3,567 భవనాలకు సంబం?ధించి రూ.1.40 కోట్లు వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఆస్తి పన్నులు మినహా ఇళ్లకు సంబంధించిన పన్నుల్లో సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,487 ఇళ్లకు రూ.6.36 కోట్ల లక్ష్యానికి రూ.6.13కోట్లతో 96.99 శాతంతో ముందంజలో నిలిచారు. వేములవాడ మున్సిపాలిటీలో రూ.4.07కోట్లు లక్ష్యం కాగా రూ.3.47 కోట్లు వసూలు చేసి 85.14 శాతంతో నిలిచారు.పన్నుల వసూళ్లలో పల్లెలు అదర్శం..పన్నుల వసూళ్లలో పల్లెలు అదర్శంగా నిలిచాయి. 2024-25 మార్చి 31వరకు ఆస్తి పన్నుల వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలోనే ప్రథమంగా నిలిచింది. జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో వంద శాతం పన్నుల లక్ష్యాన్ని 99 శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 12 మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్నుల్లో పాత బకాయిలతో కలిపి రూ.7 కోట్ల 21 లక్షల 42 వేల 291 వసూలు లక్ష్యం ఉండగా రూ.7 కోట్ల 12 లక్షల 27 వేల 901 వసూలు చేశారు. కేవలం రూ.9 లక్షల 15వేల 390 మాత్రమే బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 12 మండలాల్లో 8 మండలాలు వంద శాతం వసూలు పూర్తి చేశారు. వంద శాతం లక్ష్యం సాధించిన మండలాల్లో చందుర్తి, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. 99 శాతంలో బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఉండగా తంగళ్లపల్లి 98 శాతం, గంభీరావుపేట 91 శాతంతో ఉన్నాయి. పన్నుల వసూళ్లలో బోయినపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 51,65,364 రూపాయలకు 51,18,846 రూపాయలు వసూలు చేశారు. చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీల్లో రూ.49,54,330కు వసూలు రూ.44,96,966, ఇల్లంతకుంట మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో రూ.53,52,978కు వసూలు రూ.52,74,624, గంభీరావుపేట మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.70,02,546కు వసూలు రూ.63,88,255, కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీల్లో రూ.44,82,537కు వసూలు రూ.44,96,966, ముస్తాబాద్ మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.1,07,02,265కు వసూలు రూ.1,06,73,103, రుద్రంగి మండలంలో పది గ్రామపంచాయతీల్లో రూ.29,59,690కు వసూలు రూ.29,47,630, తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామపంచాయతీల్లో రూ.88,33,109కు వసూలు రూ.86,52,434, వీర్నపల్లి మండలంలో 17 గ్రామపంచాయతీల్లో రూ.18,40,706కు వసూలు రూ.18,42,898, వేములవాడ మండలంలో 11 గ్రామపంచాయతీల్లో రూ.71,70,096కు వసూలు రూ.71,71,250, వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామపంచాయతీల్లో రూ.24,70,871కు వసూలు రూ.24,71,668, ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీల్లో రూ.1,12,08,799కు రూ.1,12,27,998 వసూలు చేశారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

వేములవాడ -నవభూమి: వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయం నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీ భూనీలా సహిత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, బలిహరణం నిర్వహించారు. కొండపైనున్న ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు డప్పుచప్పుల్లు, కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ , రాజన్న ఆలయ ఈవో కె వినోద్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాచకొండ రామాచారిసంధ్యారాణి దంపతులు కన్యాదాతలుగా వ్యవహించగా, అర్చకులు రాచకొండ విజయేంద్రచారి, రామకృష్ణాచారి, హర్షవర్ధనచారి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా కరీంనగర్ సజ్జప్ప కళాక్షేత్రం, సజ్జప్ప కూచిపూడి డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీ వారి కళాప్రదర్శనలు అందరిని అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వరంగల్‌కు చెందిన తోపుచెర్ల శ్రీనాథ్‌స్వాతి దాతలుగా వ్యవహరించగా. ముస్తాబాద్‌కు చెందిన రాసమడుగు నర్సింగారావు భక్తులకు తాగునీరు అందించారు. కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేశ్, డిఈ మహిపాల్ రెడ్డి, సూపరిండెంట్లు వెంకటరాజు, పూజిత, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

